# రిక్షా చక్రం

రవి అరండల్‌పేట చౌరాస్తాలో రిక్షాను ఆపి 'వస్తావా' ప్రశ్నించాడు.

'ఆఁ' రిక్షా దిగి తలగుడ్డ సరిచేసుకొని రిక్షా తిప్పాడు డ్రైవరు.

'బ్రాడీపేట, సిక్స్‌త్ లైన్ థర్టీన్త్, క్రాస్ రోడ్డు—ఏమిమ్మంటావు.'

'తెలుగులో చెప్పు.'

'ఆరోలైను పదమూడో అడ్డరోడ్డు.'

'ముప్పయి పైసలు.'

'లేదు. పావలా.'

'అసలే ఎండ, తల మాడిపోతూ వుంది, రాను.'

'నీ యిష్టం' రవి మరో రిక్షాను పిలవబోయాడు. అంతలో డ్రైవరు చెప్పాడు.

'సరే, కూర్చోండి.'

రవి ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా బయలుదేరింది.

హాస్పటల్ ఓ పి. గేటు కెదురుగా వాచ్‌షాపు దగ్గర 'మేనేజరుగారు వున్నారా?' ప్రశ్నించాడు రవి.

'లోపలున్నారు సార్!'

మేనేజరు సుగంబాబు వచ్చాడు. 'ఎవరూ? ఎవరుకావాలి?' 'గుర్తుపట్టలేదా?'

'హలో సార్, నమస్కారం ఎప్పుడొచ్చారు.'

'ఇవాళ ఉదయం.'

కుశలప్రశ్నల అనంతరం, కాఫీలు తాగింతర్వాత 'ఏం కావాలి సార్?'

'ఏం లేదు మిమ్మల్ని చూచిపోదామని వచ్చాను. ఇటు వచ్చి చాలాకాలం అయిందికదా.'

లేచి రాబోతున్న రవి గేటులో టక్కున ఆగిపోయాడు. ఏదో విషయం గుర్తుకు వచ్చింది. నాల్గు నెలలక్రితం వాచ్ చెడిపోయింది. తను పనిచేసే వూరులో ఉన్న పెద్ద వాచ్ షాపులోనే దాన్ని బాగుచేయటానికి ఇస్తే నెల వుంచుకొని పార్ట్సు రాలేదని, మేమేమీ చేయలేమనీ తిరిగి ఇచ్చారు. సెలవుల్లో స్వగ్రామం వచ్చి అక్కణ్ణుంచి హైద్రాబాద్ పోవటం ఎలానూ వుంది కాబట్టి అక్కడ బాగుచేయించ వచ్చులే అని జేబులో వేసుకువచ్చిన వాచ్ సంగతి గుర్తుకు వచ్చింది. సుగంబాబును చూడబోయినప్పుడు వాచ్ సంగతి దృష్టిలో లేదు. వెళ్లిపోబోయేటప్పుడు అకస్మాత్తుగా 'ఇదీ వాచ్ షాపేకదా, ఈ గడియారం బాగయ్యే అవకాశం ఏమయినా వుందేమో కనుక్కుందామనిపించింది.

వాచ్ వెలుపలికి తీసి, వెనుదిరిగి, దాని చరిత్ర అంతా చెప్పి, 'ఇది బాగయ్యే అవకాశం . . . . . .'

'ఏ వాచ్ అయినా బాగవుతుంది. ఇలా ఇవ్వండి' తీసుకొన్నాడు.

గడియారం ఊడదీసి అందులో ఆర్బార్, రాచట్ వీల్ వేయాలి అన్నాడు. ఈ పార్ట్స్ దొరకటం లేదనీ, కంపెనీకి వ్రాసినా రావనీ చెప్పాడు. తన ఊళ్లో కూడా అలాగే జరిగిందని తెలిపాడు రవి.

'మరి ఇక ఈ వాచ్ బాగుకాదా?'

'బాగు చేస్తాంగా. రేపు రండి.'

'బాగవుతుందంటారా?'

'తప్పకుండా రేపు రండి మీరు.'

'చార్జి ఎంతవుతుంది?' తన ఊళ్లో దాన్ని బాగుచేయటానికి పదిహేను రూపాయలు అడిగారు. అయినా బాగుచేయలేక పోయారు.

'ఎంతో మీ యిష్టం' ఇష్టం వచ్చినంత ఇద్దురుగాని రేపు రండి.'

'చెబితే బాగుంటుంది.'

'రేపు చెబుతాంగా, మీరు వెళ్లిరండి.'

రవి రోడ్డుమీదికి వచ్చి స్టేషన్ వైపు వెళ్లిపోయాడు.

* * * *

ఎదురుగా వస్తున్న కారు దూకుడుగా వుంటే రిక్షా ప్రక్కకు తప్పించి కోపంగా చాలా తిట్లుతిట్టాడు డ్రైవర్, కారు డ్రైవర్ని.

'ఎందుకలా తిడతావు' రవి యధాలాపంగా అంటే, వీళ్లంతే వళ్లుపొగరు గాడిదకొడుకు. పోయిన్నెల ఒకడు నా రిక్షా నుగ్గునుగ్గు చేశాడు. పాపం లోకంలో నూకలుండి ఆ ఆసామీ నేనూ బ్రతికిపోయాంగాని, ఎదురుగా కారు వస్తుంటే తప్పుకోని ముందుకు పెళ్లాడు.

'రెండు వారాలు రిక్షా లేక రిక్షా ఇచ్చేవాడు లేక తిండి లేక, బియ్యం కొనుక్కోనేందుకు డబ్బులు లేక మేమిద్దరం, ఆరుగురు పిల్లలు చచ్చిన చావు, ఏమని చెప్పేది.

రిక్షా ముందుకు పోతూవుంది.

'రోజుకు ఎంత సంపాయిస్తావు?'

'ఎంతేముంది! బాడుగపోను మూడో, నాలుగో మిగిలితే ఆ రోజు బాగా దొరికినట్లు. ఇంట్లో నాలుగు రూపాయలు అయినా కావాలి. రూపాయి అంటే ఎంత? పాత పావలా!

రిక్షా డ్రైవరు చెప్పుకుపోతున్నాడు. పన్నెండు గంటల సమయంలో ఏప్రిల్ నెల. ఎండలు వళ్లుకాలుస్తుంటే డ్రైవర్ బనీను మింగగా మిగిలిన చెమట బొట్లు వీపులోంచి వెలుపలికి నీటిమీద బట్టవేసినట్టు వస్తున్నాయి.

'నీ భార్యగానీ పిల్లలుగానీ ఏం పనీ చేయరేమిటి?'

'అదో రోగిష్టిది. ఏం చేప్పేది. కడుపు దించుకొంటే కాళ్లముందు పడుతుంది. మొన్న ఒకరోజు జ్వరం వచ్చి రిక్షా వేయలేదు. నాసామి రంగా ఆమె చీదుడు, పిల్లల ఏడుపులు విని జ్వరం ఎక్కడకు పోయిందో ఏమో, తెల్లారి రోజుకంటె ముందే రిక్షా ఎక్కాను.'

రవికి అతనిమీద జాలి కలిగింది.

'ఇంకేదయినా పని చేయలేకపోయావా!'

'నాబోటివానికి, ఇంకేం పనిజేస్తే రోజుకు నాలుక్కంటే ఎక్కువ వస్తుంది?'

డ్రైవర్ నిరాశగా సైకిల్ రిక్షా తొక్కుతుంటే కాళ్లు తేలి పోతున్నట్లు అనిపించింది.

*　　*　　*　　*

ఓ.పి. గేటు దగ్గర రవికి స్నేహితుడు కలిసాడు. మాటల సందర్భంలో తన భార్యకు పిల్లలు కలక్కపోతుంటే ఆపరేషన్ చేయిస్తున్నట్లు, ఆమె థియేటర్‌లో వున్నట్టు మిత్రుడు తెలియజేశాడు.

రవి హాస్పటల్‌వైపు చూస్తే గుండె కొట్టుకోవడం ఆగిపోయినంత భయం కలిగింది. ఆపరేషన్ అంటే ఎంతో భీతి చిన్నతనంనుంచీ అంతవరకు టాన్‌సిల్స్ ఆపరేషన్ చేయించుకోటానికి ఇష్టపడలేదు రవి. నాన్న కడుపునొప్పికి ఏదో ఆపరేషన్ చేయటంవల్ల చనిపోయిన సంగతి చిన్నతనంలోనే అతని మనస్సుమీద చెరగని భయం ముద్రవేసింది.

ఇద్దరూ మాట్లాడుకొంటూ వాచ్‌షాపుకు వచ్చారు. మిత్రుడు విడిపోతే రవి షాపు లోపలికిపోయి కూర్చున్నాడు.

ఒక వాచీ టేబిల్‌మీద అన్ని పార్ట్సు విప్పబడివుంది.

'నా వాచీ . . .'

వర్కరు చెప్పాడు.

'ఇది మీ వాచీయే.'

అప్పుడు మేనేజరు షాపులో లేడు. ఎక్కడి పార్ట్సు అక్కడ పడివున్న గడియారంవైపు చూస్తే దిగులయింది.

'కొత్తవి దొరకవు. పాత పార్ట్సు మాదగ్గరున్నాయ్. ఏవయినా ఉపయోగపడతాయేమో వెతుకుతున్నాడు. ఇంతవరకూ దొరకలేదు.'

వర్కరు ఏవేవో వెతుకుతూనే ఉన్నాడు.

గడియారం విప్పితే ఇలాగే వుంటుందికాబోలు ననిపించింది. టేబిల్‌వైపు చూడ బుద్ధికాలేదు. ఏ వాచీ అయినా ఆడు

తున్నప్పుడే దాని అందం ఆగిపోతే ఏముంది? అన్ని భాగాలు విడివిడిగా నిర్జీవంగా కనిపిస్తుంటే గుండె కలుక్కుమంది.

అటు చూడలేక హాస్పిటల్ వైపు చూస్తూ కూర్చున్నాడు రవి.

రోగులు ఎందరో వెలుపలికి వస్తున్నారు, పోతున్నారు.

ఎన్ని జబ్బులవాళ్లు లోపలికి పోతున్నారో, ఎన్ని జబ్బులు బాగయి ఎందరు తిరిగి వస్తున్నారో, తిరిగి రానివాళ్లు, తీసుకు రాబడేవాళ్లు ఎంతమందో, బాధగా ఆలోచన సాగుతూంది.

యథాలాపంగా హాస్పిటల్ టవర్ క్లాక్ వైపు చూశాడు. గడియారం ఆగిపోయింది.

హాస్పటల్ గుండె ఆగిపోయిందేమో ననిపించింది.

'గడియారం బాగుచేసి, రేపటికి టైం అడ్జస్ట్ చేసి ఇస్తాం—ఏమనుకోకుండా రేపు రండి.

'అలాగే!'

అలా అన్నాడు కానీ లేవబుద్ధికాలేదు. అక్కణ్ణుంచి బయటికి వచ్చేసరికి చాలా కాలం పట్టింది.

'ముందు చక్రం గాలిపోయింది. కొట్టిస్తాను కొంచెం దిగండి.'

రవి రిక్షా దిగాడు.

టైర్‌కు గాలికొడుతూవుంటే గుండెలనిండా గాలిపీల్చుకొన్నాడు రవి.

'ఆఁ! కూర్చోండి.'

మళ్లీ రిక్షా బయలుదేరింది.

'బళ్లు సరీగ్గావుండవు. బాడుగమాత్రం సరీగ్గా ఇవ్వాలి.'

గొణుక్కున్నాడు డ్రైవరు.

వింటూ కూర్చున్నాడు రవి. అతనికి ఎందుకో దిగులుగా వుంది.

'బెల్ సరిగా లేదు. టైర్లు పాతవి, ఏమిటో బండి సరిగా నడవటంలేదు.

అతని సంసారం గడపటం ఎంత కష్టమో ఆలోచిస్తుంటే దిగులు ఎక్కువయింది.

నెలకు అయిదు వందలు వచ్చినా ఏ నెలకా నెల జీతం కోసం ఎదురుచూడటం తప్పటంలేదు. మూర్తి తన కీయవలసిన మూడు వందలు ఇస్తే తన ప్రయాణం ముందుకు సాగుతుంది. లేదంటే మళ్లీ వెనక్కు వెళ్లక తప్పదు. ఇంటిదగ్గర వున్నాడో లేడో, ఉన్నా డబ్బు ఇస్తాడో లేడో తెలియదు. ఏమేమో ఆలోచించుకొంటూ పోతుంటే పోతూవుంది రిక్షా!

'ఇవాళ లేచి ఎవడి ముఖం చూశానో పొద్దుట్నుంచి రూపాయికూడా తోల్లేదు.'

రిక్షా డ్రైవరు గొణుక్కుతున్నాడు.

* * * *

ఆపరేషన్ అయిపోయింది. ఆమె ఆరోగ్యంగా వుంది.

ఆపరేషన్ విజయవంతమవుతుందని, పిల్లలు కలుగుతారని డాక్టరు చెప్పింది, మా అదృష్టం ఎలావుందో.

స్నేహితుడు ఓ.పి. గేటుదగ్గర కనిపించి చెప్పాడు.

రవికి సంతోషం కలిగింది. తృప్తిగా హాస్పిటల్ గడియారం వైపు చూశాడు. టవర్ క్లాక్ తిరగటం లేదు.

వాచీషాపులో వర్కరు లేడు. కాఫీతాగడానికి వెళ్లాడు. రవి కూర్చున్నాడు. సుగంబాబు ఏదో గేయం చదువుకుంటున్నాడు. రవిని చూచి, మేగజైన్ దూరంగా పెట్టి 'వాచీ బాగయింది సార్. నిన్నటినుంచి టైం అడ్జస్ట్ చేశాడు. తిరుగుతూ వుంది. సంవత్సరం గ్యారంటీ' చెప్పాడు.

రవికి ఎంతో సంతోషమయింది.

'వర్కరు ఇప్పుడే వస్తాడు! రాగానే అడిగి ఇస్తాను.'

వ్యాపారం సక్రమంగా జరగడం లేదనీ, ఆ మధ్య బిజినెస్ పూర్తిగా డల్ అయిందనీ షోకుకోసం గడియారం కట్టుకొనే వాళ్లేగాని టైంకోసం కొనేవాళ్లు తక్కువ అయ్యారనీ, టవర్ క్లాక్కులు గోడ గడియారాలు ఎక్కువయిపోయాయనీ, టైంతో నిజంగా అవుసరం ఉన్నవాళ్లు గడియారాలు కొనుక్కోవటం లేదనీ, అన్నివిధాలా వ్యాపారం మాత్రం లేదనీ చెప్పుకుపోతున్నాడు సుగంబాబు.

రవి హాస్పిటల్ వైపు చూశాడు, ఏ అలజడీ లేకుండా విసిరేసిన రాయిలా పడివుంది హాస్పిటల్. ఎండపడి రాయి మెరిసినట్లు నర్సు క్వార్టర్సనుంచి తొంగిచూచే నర్సుల ముఖాలు మాత్రం వెలుగుతున్నాయి.

హాస్పిటల్ డ్యూటీ అయిపోయి, ప్రవేటు ప్రాక్టీసు తగ్గిపోకుండా చూచుకోవటం కోసం డాక్టరు గబగబా కారులో వెళుతున్నాడు.

ఓ.పి. లో జనం రద్దీ తగ్గిపోయింది. ఉదయం అయితే అక్కడ తిరునాళ్లు!

వర్కరు వచ్చాడు.

* * * *

ఆరో లైన్ పదమూడో అడ్డరోడ్డు మీద ఆపి 'ఇదే!' అన్నాడు రిక్షా డ్రైవరు.

'అదిగో ఆ కనిపించే ఇల్లే అక్కడాపు' అన్నాడు రవి.

'అక్కడదాకా పోవాలా?'

'ఆఁ!'

వంద గజాల దూరం వుంటుంది. రిక్షా బయలుదేరింది.

మూర్తికి నెలకు ఆరువందల జీతం వస్తుంది. మూడు వందలు ఇవ్వడం ఏ మాత్రం కష్టంగాదు. అయినా నాలుగు సంవత్సరాలనుంచి ఇవ్వలేకపోతున్నాడు.

ఇప్పుడయినా ఇస్తాడో లేదో?

రిక్షా ఆగింది.

రవి దిగాడు. పర్సు తీస్తుంటే రిక్షా డ్రైవరు కుటుంబం కళ్లల్లో మెదిలింది. కళ్లు తడి అయ్యాయి.

నాలుగు పది పైసలు తీసి ఇస్తుంటే రిక్షా డ్రైవరు ఎగాదిగా చూచి 'ఏం దిది' అన్నాడు.

'ఏంటి?' అయోమయంగా చూశాడు రవి.

'అర్ధరూపాయి!'

'అక్కణ్ణుంచి వందగజాలుకూడా లేదు.'

'ఎందుకు?'

అర్ధరూపాయి. అంతే?' ఏమిటేమిటో మాట్లాడుకున్నాడు డ్రైవర్.

'నేను నీకు ఇస్తానన్నది' పావలా. ఇస్తుంది నలభై పైసలు. అర్ధరూపాయి ఇమ్మనటంలో అర్థంలేదు. గట్టిగా చెప్పాడు రవి.

‘మీరు రమ్మంది ఆర్లోలైన్ పదమూడో అడ్డరోడ్డుకు. వచ్చింది ఇక్కడకు. అక్కణ్ణుంచి ఇక్కడకు మాట్లాడుకోలేను. పావలా అవుతుంది. మొత్తం అర్ధరూపాయి.

‘ఉన్నా లేకపోయినా—అర్ధరూపాయి.’

‘నలభై పైసలకంటే ఎక్కువ ఇవ్వను తీసుకుంటే తీసుకో లేకపోతే లేదు.’

‘ఎవడిక్కావాలి ముష్టి నలభై పైసలు, మండుటెండలో చచ్చీ చెడీ .........’ ఇంకా నేమేమో పెద్ద పెద్దగా అరుస్తూ వున్నాడు.

‘ఇది తీసుకొంటే తీసుకో లేకపోతే లేదు. నేను పోతున్నాను.’

‘ఎలా పోతావో చూస్తానుగా.?

రవికి నిజంగా భయం వేసింది. ఆ అరుపులు మూర్తి ఇంట్లోంచి ఎవరో బైటకువచ్చి చూస్తున్నారు. రవికి సిగ్గు వేసింది.

పర్సులోంచి మరో పదిపైసల బిళ్ల తీసి మొత్తం అర్ధ రూపాయి ఇచ్చాడు. రిక్షా డ్రైవరు విసురుగా తీసుకొని వెళ్లిపోతుంటే చూస్తూ నిలపడిపోయాడు రవి.

*         *         *         *         *

రవి వాచీ చేతికి పెట్టుకొన్నాడు. నాలుగునెలలు తర్వాత గడియారం ఆడుతుంటే గుండె ఆడినట్లుగా వుంది.

‘ఎంత ఇమ్మంటారు?’

మీ ఇష్టం!’

రవి సందిగ్ధతలో పడిపోయాడు. ఎంత ఇవ్వాలి, అర్థం కాలేదు.

'ఎంతో చెప్పండి ఇస్తాను.'

సుగంబాబు నవ్వాడు. 'ఎంతో ఇవ్వండి.'

ఎంత ఇస్తే గడియారం బాగుచేసిందానికి సరిగ్గా ఇచ్చినట్లు అవుతుందో తెలియలేదు. దగ్గర డబ్బుకూడా తక్కువగా వుంది. నూటపన్నైభై రూపాయల వాచీ ఇక ఎందుకూ పనికిరాదు అనుకొంటుంటే బాగయింది. ఎంత ఇవ్వాలి ఆలోచించుకొంటున్నాడు.

'మీరు చెబితే బాగుంటుంది.'

'ఇందులో చెప్పేది ఏముంది. తెలియనివాళ్లకయితే చెప్పాలి. మీ యిష్టం!'

తనున్న వూళ్లో గడియారం బాగుచేయటానికి పదిహేను అడిగారు. బాగుచేయలేకపోయారు. వీళ్లు ఇంత అని అడగటం లేదు. వాచీ బాగుచేశారు. ఎంత ఇవ్వాలి ఆలోచించి పర్సు తీసి, రెండు పదులు టేబిల్‌మీద పెట్టాడు రవి.

సుగంబాబు కాగితాలవైపు, రవి ముఖంలోకి ఎగాదిగా చూశాడు.

రవి గుండె ఆగినంత పనయింది.

'ఏమిటండి ఇది? అదోలా నూదిరిగా నవ్వాడు. అడిగాడు.

అంతకంటే ఇవ్వలే నిప్పుడు ఇంకా ఏమయినా ఇవ్వవలసి ఉంటే ఊరు వెళ్లి పంపుతాను.'

‘అది సరేలెండి, ఇంత అక్కరలేదు, తీసుకోండి.’

‘అక్కర్లేదా!’

‘ఆఁ!’

‘నిజం!’

‘నిజమే!’

రవికి తను ఎక్కడుందీ అర్థంకాలేదు. సుగంబాబు ముఖంలోకి తృప్తిగా చూచి పోనీ ‘ఓ అయిదు రూపాయలు ఇచ్చేయండి.

‘ఆ అయిదు మీరే ఇవ్వండి!’

అతను రవిదగ్గర చివరకు అయిదు రూపాయలే తీసుకొన్నాడు.

*   *   *   *

వరండాలో మూర్తి ముగ్గురు మనుష్యులను సర్ది చెబుతున్నాడు.

‘వచ్చే నెలలో ఎంతోకొంత సర్దుతాను. ఇప్పటికిది వుంచండి. ఇంతకంటె ఇవ్వలేను.

వాళ్లు అసంతృప్తితో ఏమేమో అంటున్నారు. మూర్తి తల ఎత్తలేదు.

మేమిక కోర్టుకు పోవలసి వస్తుంది’ వాళ్లు బెదరిస్తూ వెళ్లిపోయారు.

‘ఏం రా బాగున్నావా?’

రవి మూర్తిని పలకరించవలసి వచ్చింది.

‘ఇలా వున్నాను రా.’

'డబ్బు ఏమయినా ఇస్తావేమోనని అడగటానికి వచ్చాను రా.'

'చూశావుగా. దమ్మిడీ లేదు.'

రవి మళ్లీ ఏమీ మాట్లాడలేక పోయాడు.

ఆపైన కుశలప్రశ్నలు, వీడ్కోలు పది నిమిషాలలో అయి పోయాయి.

*   *   *   *

వాచీ పెట్టుకొని షాపులోంచి బైటకి రాగానే ఏడుపు వినిపించింది.

హాస్పిటల్‌లోనుంచి శవం వెలుపలికి వచ్చింది. వెంటవున్న వాళ్లు ఏడుస్తున్నారు.

చనిపోయిన వ్యక్తికి ఆపరేషన్ అంటే భయమట! అబ్డామిన్ ఆపరేషన్ కోసం థియేటర్‌లోకి తీసుకుపోతుంటే గుండే ఆగి చనిపోయాడట.

టాక్సీకోసం నిలబడ్డారు.

రవి దగ్గరకుపోయి శవాన్ని చూశాడు. అతని గుండె ఆగిపోయింది. చేతనున్న వాచీ మాత్రం తిరుగుతూ వుంది. టైం కరెక్ట్‌గా వుంది. హాస్పటల్ టవర్ క్లాక్ ఆగిపోయే వుంది.

రవి చేతిగడియారం మాత్రం కరెక్ట్‌గా నడుస్తూ వుంది.